విజయం ప్రాప్తిరస్తు


ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో స్పెషల్ క్లాసులకు హాజరైన టెన్త్ విద్యార్థులు


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో డీసీఈబీ మెటీరియల్‌తో టెన్త్ విద్యార్థులు

- పది పరీక్షలకు సమయం ఆసన్నం
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులు

సీతంపేట: విద్యార్థి దశలో అత్యంత కీలకమైన పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దృఢసంకల్పంతో ఉన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని తొమ్మిది జీవీఎంసీ హైస్కూళ్లలో సుమారు 976 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 3 నుంచి ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో కౌంట్‌డౌన్ మొదలైంది. ఒత్తిడి, ఆందోళన లేకుండా పరీక్షలు రాసేలా విద్యార్థులను టీచర్లు సన్నద్ధం చేశారు. నూరు శాతం ఫలితాల కోసం ఉపాధ్యాయులు.. మంచి మార్కులు సాధించాలని విద్యార్థులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రోజూ వేకువజాము ఐదు గంటలకే విద్యార్థులు మేల్కొని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. స్పెషల్ క్లాసులు, ప్రత్యేక శిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు.

పక్కాగా 100 రోజుల ప్రణాళిక

నూరు శాతం ఉత్తీర్ణత కోసం జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో 100 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేశారు. నవంబర్ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తయ్యింది. డిసెంబర్ నుంచి మార్చి 20 వరకు వంద రోజుల ప్లాన్ చేపట్టారు. జనవరిలో నిర్వహించిన సమ్మేటివ్-1 మార్కుల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గుర్తించి ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించారు. బీ గ్రేడ్ విద్యార్థి ఏ గ్రేడ్ సాధించేలా.. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు మినిమం పాస్ మార్కులు సాధించేలా ముఖ్య అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రిపరేటరీ1, 2, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి తుది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సిద్ధం చేశారు.

ప్రస్తుత పరీక్షా విధానంలో..

ప్రస్తుత పరీక్షా విధానంలో వన్ మార్కు ప్రశ్నలు 12, రెండు మార్కుల ప్రశ్నలు 8, నాలుగు మార్కుల ప్రశ్నలు 8, ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5 రాయాల్సి ఉంది. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఒక్క మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయగలిగేలా శిక్షణ ఇస్తున్నారు. దీని కోసం జీవీఎంసీ అందజేసిన డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు మెటీరియల్‌ను విద్యార్థులతో చదివిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థుల వివరాలు

జీవీఎంసీ స్కూల్ పేరు	టెన్త్ విద్యార్థులు
మధురానగర్ హైస్కూల్	86 మంది
ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్	90 మంది
ఎస్ఎంసీహెచ్ హైస్కూల్	191 మంది
కప్పరాడ హైస్కూల్	103 మంది
ఆర్పీ పేట హైస్కూల్	143 మంది
మాధవధార హైస్కూల్	146 మంది
కె.కాలనీ హైస్కూల్	109 మంది
రైల్వే న్యూకాలనీ హైస్కూల్	34 మంది
కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్	74 మంది
మొత్తం	976 మంది

స్కూల్ టాపర్‌గా నిలుస్తా



6వ తరగతి నుంచి మధురానగర్ స్కూల్‌లో చదువుతున్నాను. టెన్త్ ప్రీఫైనల్ పరీక్షల్లో 600కు 569 మార్కులు సాధించాను, గతేడాది స్కూల్ టాపర్ సాధించిన 583 మార్కులు కంటే ఒక్క మార్కు అయినా ఎక్కువ సాధించాలని బాగా ప్రిపేర్ అవుతున్నాను. హెచ్ఎం, ఉపాధ్యాయులందరూ మాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు.

– ఐ.స్పందన, పదో తరగతి విద్యార్థిని

మంచి మార్కులు తెచ్చుకుంటా



తొమ్మిదో తరగతి నుంచి మధురానగర్ స్కూల్‌లో చదువుతున్నాను. టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షల్లో 600కు 568 మార్కులు సాధించాను. ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్కూల్‌లో చదివిస్తున్నారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు.

– ఎస్.భోగేష్, టెన్త్ విద్యార్థి

10 జీపీఏ సాధిస్తా



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్నాను. 10 జీపీఏ సాధించడానికి ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను దృష్టిలో పెట్టుకుని చదువుతున్నాను. స్పెషల్ క్లాసుల ద్వారా సందేహాల నివృత్తి చేసుకున్నాను. ఉపాధ్యాయుల టైం టు టైం గైడెన్స్‌తో పరీక్షలకు సిద్ధమయ్యాను.

– కొసనం వాసవి శ్రీజ, టెన్త్ విద్యార్థిని

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా సన్నద్ధం



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో టెన్త్ క్లాస్ 86 మంది చదువుతున్నారు. పదో తరగతి పరీక్షలంటే విద్యార్థుల్లో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటుంది. దాని నుంచి బయటపడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా మోటివేషన్ చేశాం. డీ గ్రేడ్ విద్యార్థులు పాస్ అయ్యేలా ప్రత్యేక మెటీరియల్ చదివించాం. నూరు శాతం ఉత్తీర్ణతకు సమష్టిగా కృషి చేస్తున్నాం. ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధిస్తారని భావిస్తున్నాను.

– శాంతికుమారి, హెచ్ఎం, జీవీఎంసీ హైస్కూల్, మధురానగర్

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు


విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లు అందిసున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: ఈ నెల 3 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్లు(ప్యాడ్, పెన్, ఎరేసర్, షార్పనర్, పెన్సిల్, స్కేల్, పౌచ్ పంపిణీ చేశారు. మాధవధార జీవీఎంసీ హైస్కూల్లో శుక్రవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం సందడి నిర్వహించారు. మూల గోవిందరావు ఆర్థిక సాయంతో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ చేతుల టెన్త్ విద్యార్థులకు స్కూల్ ఆవరణలో కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తున్న మూల గోవింద్ రావు కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హేమలత, వైఎస్సార్ సీపీ 50వ వార్డు నాయకులు భరణికాన రామారావు, పైడి కృష్ణారావు మాస్టర్, సనపల నారాయణ స్వామి, పొన్నాడ అప్పారావు మాస్టర్, సోనీ, శివరాం, వేణు, సబ్బవరపు శ్రీను, రామారావు, కనమటి రఘు, లక్ష్మీకాంతం, అప్పలరాజు, రొంగలి రాము తదితరులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి సమష్టి కృషి

ఏయూ క్యాంపస్: చైల్డ్‌లైన్ నోడల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రిసోర్స్ ఆర్గనైజేషన్‌పై జిల్లాస్థాయి సమావేశం శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈలో నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బాలల సంక్షేమం, భద్రతలో ప్రభుత్వ శాఖలు, ఎన్జీవోలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పిస్తారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


విందులో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్ మస్జిద్–ఈ–అల్ ఖాదీర్ వద్ద వీ–టెక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు, మహిళలకు ప్రత్యేక పానీయం అందజేశారు. కార్యక్రమాన్ని వీ–టెక్ సంస్థ డైరెక్టర్ షేక్ మదీనా వలి పర్యవేక్షించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, బాషా, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న గాయని వెంకటరమణి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. చాగంటి మహాలక్ష్మి, మల్లాది రవికుమార్ శిష్యురాలు పాండ్రువాడ వెంకటరమణి తన అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. గణేష వందన, నిన్నే భజన, ఒకపరి చూడగ, సీతమ్మ మాయమ్మ, కనుగొంటి శ్రీరాముని, నను బ్రోవమని, శ్రీరాముల దివ్య నామ, రామ కోదండరామ, రామచంద్రుడు నాపై కీర్తనలు వీనుల విందు చేశాయి. సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని వెంకటరమణిని సత్కరించారు.

రక్షణ గిరిలో పరిశుద్ధ శిలువ మార్గం


శిలువ మార్గం చూపుతున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. పాస్కా కాలం 5వ శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో పరిశుద్ధ శిలువ మార్గం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ప్రకాశ్ మాట్లాడుతూ ఏసు క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండటం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ నెల 7న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు బేతా జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ


నక్కవానిపాలెంలో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న సిబ్బంది


కంచరపాలెం రైతుబజార్‌లో కరపత్రాలు అందిస్తున్న ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది

సీతమ్మధార: క్షయ వ్యాధి లక్షణాలుంటే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని ఎస్‌టీఎస్ సత్యనారాయణ సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా డీఎల్ఏటీ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రబాబు ఆదేశాల మేరకు భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 24వ వార్డు నక్కవానిపాలెంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఉచితంగా టీబీ పరీక్ష, ఎక్స్‌రే, సీబీఎన్ ఏఏటీ, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నారన్నారు. క్షయ నిర్ధారణ పరీక్షలు, చికిత్సకు ప్రైవేట్ హాస్పిటళ్లను సంప్రదించవలసిన అవసరం లేదన్నారు. టీబీ రోగికి పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు ఇస్తున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తుడితో మందులు మింగించే పర్యవేక్షకులకు రూ.1,000, రూ.1,500 పారితోషకం ఇస్తారన్నారు. జిల్లాలోని అగనంపూడి, అల్లిపురం, ఆరిలోవ, భీమిలి, విశాఖపట్నం డీటీసీ, గాజువాక, గోపాలపట్నం, మధురవాడ, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, పెందుర్తి, ఆర్పీపేట, శ్రీహరిపురం ప్రాంతాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం వార్డులో ర్యాలీ చేసి కరపత్రాలు పంచిపెట్టారు. ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు

కంచరపాలెం: ఆర్పీ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక నేతృత్వంలో శుక్రవారం కంచరపాలెం రైతుబజార్‌లో 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. క్షయ లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలను చేపట్టాయన్నారు. రైతులు, వినియోగదారులు, డ్వాక్రా మహిళలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీ పీఆర్‌వో ఎన్.పైడిరాజు, సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నేడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకర్స్ పార్కులో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త, మోటివేటర్, రిసోర్స్ పర్సన్, విశాఖ జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్ సభ్యురాలు రహీమున్నీసా బేగమ్ ముఖ్య అతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కులు, సమస్యల పరిష్కారం అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. వినియోగదారుల సమస్యలకు న్యాయ సంబంధ పరిష్కారాలను ఆమె వివరిస్తారని చెప్పారు. సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

ప్రభుత్వరంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగించాలి

సీతంపేట: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 1న నగరంలో జరిగే మానవహారంలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 700 రోజులుగా ఉద్యోగులు దీక్షలు చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కృషి చేయాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలకు రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 1వ తేదీన గాంధీ విగ్రహం నుంచి, ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ జంక్షన్ వరకు కార్మిక ప్రదర్శన, అనంతరం నిర్వహించే మానవహారంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రావికృష్ణ, ఎన్.పాపారావు, పి.రాంబాబు, ఎం.ఈశ్వరరావు, కె.అప్పలరెడ్డి, తాతారెడ్డి, ఒ.అప్పారావు, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆవో రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేకం జరిపిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు


సీతంపేటలో భక్తులకు అన్నదానం చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద శ్రీరామ పట్టాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్య కలశాలతో వేదమంత్రాల నడుమ సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుల పంచలోహ విగ్రహాలకు పట్టాభిషేకం జరిపించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలదండలతో అలంకరించి వెండి కిరీటాలు ధరింపజేశారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

అంబికాబాగ్ రామాలయంలో..

దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ మహారాణిపేటలో గల అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామివారిని సింహాసనంపై కూర్చొబెట్టి పట్టాభిషేక ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన


అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న వాసవ్య మహిళా మండలి సభ్యులు

సీతమ్మధార: వాసవ్య మహిళా మండలి, విప్రో వారి సౌజన్యంతో కుశాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుశాల్ పీడీ మాధవి గణపతి మాట్లాడుతూ నగరంలోని 72 అర్బన్ హెల్త్ సెంటర్ల లో కుశాల్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. బాలింతలు, గర్భిణులు, మహిళ లు, బాలికలు, రుతుక్రమం ఆగిన వారు సంపూర్ణ ఆరోగ్యం కోసం అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలన్నారు. వివిధ రకాల క్యాన్సర్లు, ఇతర ప్రాజెక్టు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆమె చెప్పారు. ఆరోగ్య సూత్రలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు వరలక్ష్మి, షర్మిల, సుజాత, మహిళా పోలీస్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ గౌరీ, రాజలక్ష్మి, ఏఎన్ఎం కృష్ణ వేణి, ఆశా వర్కర్ భవాని, కమ్యూనిటీ సభ్యులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిధిలోని న్యూకోచింగ్ కాంప్లెక్స్ దగ్గరలో రైల్వే ట్రాక్ కింద గల డ్రైనేజీలో శుక్రవారం మధ్యాహ్నం కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. సుమారు 30 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి గుర్తుతెలియని రైలు నుంచి జారిపడటం వల్ల గానీ, రైలు ఢీకొట్టడం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మర్రిపాలెం స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ కిందనున్న డ్రైనేజీలో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి క్రీమ్ కలర్ షర్ట్, గ్రే కలర్ జీన్ ప్యాంట్స్, వైట్ కలర్ బనియన్, రెడ్ కలర్ బెల్ట్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి శరీరంపై గోవిందు అనే తెలుగు అక్షరాలు, సరళ అనే ఇంగ్లిష్ అక్షరాలతో పచ్చబొట్లు మాత్రమే ఉన్నాయి. ఇతడి గురించి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో గానీ తెలియజేయాలని సీఐ కోరారు. జీఆర్పీ సీఐ సూచనల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూగర్భ జలాల ఆవశ్యకతపై వర్క్‌షాప్


మాట్లాడుతున్న అధికారి లక్ష్మణారావు

మల్కాపురం: నేషనల్ హైడ్రోలజీ ప్రాజెక్ట్‌లో భాగంగా 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భూగర్భ జలాల మానిటరింగ్, సుస్థిరత అనే అంశాలపై విశాఖ జిల్లా భూగర్భ జల శాఖ అధికారి లక్ష్మణరావు అవగాహన కల్పించారు. భూగర్భ జలాల ఆవశ్యకత, వినియోగించాల్సిన అవసరం, భద్రత గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. మేఘాలు ఎలా ఏర్పడుతాయి, వర్షపు నీటిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలను విశదీకరించారు. నీటిని ఎలా కొలుస్తారు, నీటి పరీక్షలు ఎలా చేస్తారు అనే వాటిని విద్యార్థులచే స్కూల్ ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. శ్రీకాకుళం జిల్లా భూగర్భ జలాల సహాయ సంచాలకుడు రమణమూర్తి వేసవి కాలంలో భూగర్భ జలాల హెచ్చు, తగ్గుల వినియోగం తదితర అంశాల గురించి స్టూడెంట్లకు వివరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా జల వనరుల డీఈఈ ఎం.రాజేంద్రకుమార్ ఏపీడీ కె.రమేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు కుమార్, కె.పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కాలేజీలో ప్రదర్శనలు


మానసిక పరీక్షలు, ప్రదర్శనను ప్రారంభిస్తున్న హెచ్‌వోడీ డాక్టర్ చక్రవర్తి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక పరీక్షలు, ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కేజీహెచ్ పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల్లో ఉండే నాయకత్వ లక్షణాలు, ఎదుగుదల లోపాలు, మానసిక బలహీనతలను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. విశాఖ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ రూపా సెల్వరాజ్, డాక్టర్ శర్వాణి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ లక్ష్మీప్రభ, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరసన దీక్షలు 729వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జరిగిందన్నారు. కె.మణి, ఆర్.వరలక్ష్మి, ఎ.పుష్ప, కె.సంతోషం, బి.భారతి, డి.కొండమ్మ, సుజాత, ఆర్.విమల, కె.వేణు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

మ్యాన్‌హోల్ లీకుతో అవస్థలు


రామకృష్ణానగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్ నుంచి మంగళ వీధికి వెళ్లే మార్గంలో 49–2–58/ఏ నంబర్ గల ఇంటి వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో రెండు వారాలుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– బొడ్డేటి శ్రీను, రామకృష్ణానగర్